సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



అలైన్‌మెంట్‌పై మోసం చేశారు

'రీజినల్' అలైన్‌మెంట్ మారుస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరయ్య ఆరోపించారు. - IIలో



రాష్ట్రంలో ఆటవిక రాజ్యం

రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, పోలీసులను అడ్డం పెట్టుకొని పాలన సాగిస్తున్నారని జగదీష్‌రెడ్డి విమర్శించారు. - IIలో



రోడ్లా.. నీటిగుంతలా

వర్షాలకు భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. - IIIలో

తీరొక్క పూలతో బతుకమ్మ

భువనగిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, మత్స్య, సంక్షేమ శాఖలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మ ఆడారు. తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు.



బతుకమ్మ ఆడుతున్న అధికారులు, కుటుంబ సభ్యులు

జెడ్పీ పీఠం జనరల్ మహిళకు?

సాక్షి, యాదాద్రి : జిల్లా పరిషత్ చైర్మన్ పదవి జనరల్ మహిళలకు రిజర్వ్ అయినట్లు తెలుస్తోంది. జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్, ఎంపీటీసీలు, ఎంపీపీ స్థానాలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లను అధికారులు రెండు రోజుల క్రితం ఖరారు చేశారు. 17 జెడ్పీటీసీ స్థానాలు ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లా పీఠం గతంలో జనరల్ కేటగిరీలో ఉంది. రిజర్వేషన్లలో భాగంగా జనరల్ మహిళలకు దక్కనుందని తెలుస్తోంది. అధికారికంగా వెల్లడి కానప్పటికీ అంతర్గతంగా రిజర్వేషన్ ఖరారు అయినట్లు సమాచారం.

అన్నపూర్ణగా దుర్గాదేవి



యాదగిరిగుట్ట రూరల్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం యాదగిరి కొండపై ప్రతిష్ఠించిన దుర్గామాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణములు, శ్రీదేవి మూలమంత్రములు, జపములు, సహస్రనామార్చన, మధ్యాహ్న పూజ నిర్వహించారు. సాయంత్రం నవావరణ పూజ, సహస్రనామార్చనలు, మంత్ర పుష్పం తదితర వేడుకలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

న్యూస్‌రీల్

యాదగిరిగుట్ట ఆలయ ఈఓగా రవినాయక్?

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఇంచార్జి ఈఓగా ఐఏఎస్ అధికారి జి.రవినాయక్ రానున్నట్లు తెలిసింది. ప్రస్తుత ఈఓ వెంకట్రావ్ వ్యక్తిగత సెలవుల్లో వెళ్లనున్నారు. ఆయన స్థానంలో స్థానంలో కాలుష్య నియంత్రణ మండలి బోర్డు కార్యదర్శి రవినాయక్ రానున్నారని, రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకుంటారని సమాచారం. కాగా ఈ విషయంపై ఆలయ అధికార వర్గాలు ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. రవినాయక్ గతంలో యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు.

నేడు హరీశ్‌రావు రాక

యాదగిరిగుట్ట రూరల్ : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు గురువారం యాదగిరిగుట్టకు రానున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం వేకువజామున 5.30కి గిరి ప్రదక్షిణలో పాల్గొంటారు. అనంతరం వైకుంఠద్వారం వద్ద పూజలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి యాదగిరి కొండపైకి వెళ్లి శ్రీస్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగే ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొంటార పార్టీ మండల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, యాదగిరిగుట్ట పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి తెలిపారు.

స్నేహ కమిటీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : ప్రతి గ్రామంలో 5 నుంచి 15 మంది సభ్యులతో స్నేహ కమిటీలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న స్నేహ కార్యక్రమంపై బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా స్థాయి అవగాహన, సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15–18 ఏళ్ల వయసు గల యువతీయువకులకు భద్రత, పోషకాహారం, సాధికారత, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా, వారి చదువు కొనసాగింపు, ఉపాధి నైపుణ్యాలు, ఆర్థిక స్వావలంబన వైపు దారితీసే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాస్థాయి సమన్వయ కమిటీ డీఆర్‌డీఓ, మహిళాశిశు సంక్షేమం, విద్య, ఆరోగ్యం, పోలీస్, పంచాయతీరాజ్, కార్మిక, నైపుణ్యాభివృద్ధి తదితర విభాగాలు కలసి కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కనీసం 5 నుంచి 15 మంది సభ్యులతో స్నేహ సంఘాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి శ్యాంసుందర్, ఉపాధి కల్పనా అధికారి పరాంకుశం సాహితి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బతుకమ్మ పాటకు అవార్డు



కవయిత్రి అవార్డు అందుకుంటున్న పుష్పలత

భువనగిరి: పట్టణానికి చెందిన బండారు పుష్పలతకు కవయిత్రి అవార్డు లభించింది. బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో జిల్లా నుంచి ఆమె పాల్గొని 'బతుకునిచ్చిన బతుకమ్మ' పాట పాడారు. ఇందుకుగాను ఆమెకు కవయిత్రి అవార్డును ప్రకటించారు. ప్రముఖ కవి రాములు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

గులాబీ, హస్తం.. దోస్తీ!

మదర్ డెయిరీ ఎన్నికల్లో కుదిరిన ఒప్పందం

- మూడు డైరెక్టర్ స్థానాల పంపకం
- కాంగ్రెస్ మద్దతుదారులకు రెండు, బీఆర్‌ఎస్ మద్దతుదారులకు ఒకటి
- చర్చనీయాంశమైన ఇరు పార్టీల తీరు

సాక్షి, యాదాద్రి: నల్లగొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార లిమిటెడ్ (నార్ముల్ మదర్ డెయిరీ) ఎన్నికల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది.రాష్ట్రంలో కత్తులు దూసుకుంటున్న అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఇక్కడ మాత్రం స్నేహపూర్వకంగా ముందుకెళ్తున్నాయి. ఈనెల 27న ఎన్నికలు జరగనున్న మూడు డైరెక్టర్ల స్థానాల్లో రెండు చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు, ఒక చోట బీఆర్‌ఎస్ మద్దతుదారులను గెలిపించుకునేలా ఇరు పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. బద్ధశత్రువులుగా ఉన్న ఈ రెండు పార్టీల మధ్య కుదిరిన ఒప్పందం చర్చనీయాంశంగా మారింది.

బరిలో తొమ్మిది మంది

ఖాళీ అయిన డైరెక్టర్ల స్థానాల్లో మరోసారి తుంగతుర్తి నియోజకవర్గానికి రెండు, నకిరేకల్‌కు ఒకటి దక్కింది. ఈసారి ఆలేరు, భువనగిరి నియోజకవర్గాలకు అవకాశం లభించలేదు. మూడు డైరెక్టర్ల స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మద్దతుదారులు ముగ్గురు పోటీ చేస్తున్నారు. వీరితో పాటు మరో ఆరుగురు మొత్తం తొమ్మిది మంది బరిలో ఉన్నారు. ఆరుగురు అభ్యర్థులను బుజ్జగించి పనిలో రెండు పార్టీలు ప్రయత్నిస్తుండగా తాము తప్పుకునేది లేదని వారు పట్టుబడుతున్నారు.

ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

నకిరేకల్ నియోజకవర్గానికి దక్కిన మహిళా డైరెక్టర్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు నలుగురు పోటీ పడుతున్నారు. గంట్ల రాధిక, కర్నాటి జయశ్రీ, మోతె పూలమ్మ, సూధగాని విజయ నామినేషన్ దాఖలు చేశారు. వారికి ఎన్నికల అధికారులు గుర్తులు కూడా కేటాయించారు. వీరిలో భువనగిరి ఎంపీ, నకిరేకల్ ఎమ్మెల్యేలు వేర్వేరు అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. గుంట్ల రాధికకు ఎంపీ చామలకిరణ్‌కుమార్‌రెడ్డి మద్దతు ఇస్తుండగా, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కర్నాటి జయశ్రీకి డైరెక్టర్ కోసం పట్టుబడుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే సూచించిన అభ్యర్థుల్లో ఎవరికి పార్టీ మద్దతు లభిస్తుందోనన్న ఆసక్తి నెలకొంది.

రెండు స్థానాలకు ఐదుగురు పోటీ

తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని రెండు జనరల్ డైరెక్టర్ స్థానాలకు ఐదుగురు పోటీ పడుతున్నారు. వీరిలో మంచాల ప్రవీణ్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి, శీలం వెంకట నర్సింహారెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్ పోటీలో ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ తరఫున మంచాల ప్రవీణ్‌రెడ్డికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్‌తో కుదిరిన ఒప్పందం మేరకు బీఆర్‌ఎస్‌కు ఒక డైరెక్టర్ స్థానాన్ని కాంగ్రెస్ ఒదులుకుంది. మోత్కూరుకు చెందిన రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి పేరును బీఆర్‌ఎస్ సూచించింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ జోక్యంతో లక్ష్మీనరసింహారెడ్డి పేరు ఖాయం చేశారు. బీఆర్‌ఎస్ తరఫున ఆలేరు నియోజకవర్గం నుంచి సందిల భాస్కర్‌గౌడ్ కోసం ఆ పార్టీ నాయకత్వం చివరి వరకు చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. అయినప్పటికీ భాస్కర్ బరిలో ఉన్నారు.

నామినేషన్ వేసిన అభ్యర్థులంతా పోటీలో..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మద్దతుతో డైరెక్టర్ స్థానాలకు నామినేషన్ వేసిన వారి పరిస్థితి ఇప్పుడు అయోమయంగా మారింది. ఉపసంహరణ గడువు ముగిసి గుర్తుల కేటాయింపు తర్వాత కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ముగ్గురు పేర్లు రెండు పార్టీల ప్రతినిధులు ఖరారు చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు ముందు ఒప్పందం కుదిరితే పార్టీ నిర్ణయం మేరకు విత్‌డ్రా జరిగేది. ఇప్పుడు ఉపసంహరించుకోవడానికి వీలులేక వారంతా పోటీలోనే ఉన్నారు. గత ఎన్నికల్లో ఆరు డైరెక్టర్ స్థానాలకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు హోరాహోరీగా తలపడ్డాయి. పోటాపోటీగా క్యాంపులు నిర్వహించాయి. అయితే చివరికి కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. ఈ సారి కూడా పోటీకి రెండు పార్టీలు సిద్ధపడ్డాయి. దీంతో పూర్తిస్థాయిలో విత్ డ్రాల కోసం ప్రయత్నించలేదు. అయితే ఓటింగ్‌కంటే ముందే పరస్పరం ఒప్పందం చేసుకున్నాయి.

ఆలేరు, భువనగిరి పరిధిలో అత్యధిక ఓట్లు

అత్యధికంగా ఆలేరు, భువనగిరి నియోజవర్గాల పరిధిలో పాల సొసైటీ చైర్మన్లు ఉన్నారు. వారి మద్దతు కోసం పలువురు అభ్యర్థులు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే పార్టీ బలపర్చిన అభ్యర్థులకు మద్దతు ఇవ్వాల్సిందేనని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వ్యతిరేకంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేయడానికి వెనుకాడమని మదర్ డైయిరీ చైర్మన్ చెప్పారు.

26న క్యాంపునకు చైర్మన్లు!

మదర్‌డైయిరీ పాలకవర్గం డైరెక్టర్ల స్థానాలకు ఈనెల 27వ తేదీన పోలింగ్ జరగనుంది. అదే రోజు ఓట్ల లెక్కించి విజేతలను ప్రకటించనున్నారు. ఒప్పందం కుదిరినప్పటికీ ఇరు పార్టీలు పాల సొసైటీ చైర్మన్లను 26వ తేదీన క్యాంపునకు తరలించేందుకు సిద్ధమవుతున్నాయి. పాల సొసైటీల్లో వివిధ పార్టీలకు చెందిన చైర్మన్లు ఉన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మద్దతుదారులు కాకుండా పోటీలో ఉన్న మరో ఆరుగు అభ్యర్థులు ఓట్లు రాబట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. నామినేషన్ల ఉప సంహరణ అనంతరం కాంగ్రెస్ పార్టీ నుంచి రంగంలో ఉన్న పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి పోటీలో ఉంటానని ప్రకటించారు. ఇంకా మోతె పూలమ్మ, శీలం వెంకట నర్సింహారెడ్డి బరిలో ఉన్నారు.

వండి వార్చింది.. ఒక్క రోజే

అంగన్‌వాడీల్లో ఆదిలోనే నిలిచిన ఎగ్ బిర్యానీ స్కీం

- ప్రారంభం అదిరినా అమలు శూన్యం
- ప్రభుత్వం నిధులు కేటాయించలేదంటున్న టీచర్లు


భువనగిరిటౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ పథకానికి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మరింత పుష్టికరమైన ఆహారం అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకం ఒక్క రోజుతోనే నిలిచిపోయింది. జూన్ 11న పలు కేంద్రాల్లో అట్టహాసంగా ప్రారంభించినా ఆ తరువాత అమలుకు నోచడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు ఇప్పటికే ఆరోగ్యలక్ష్మి పేరుతో ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తోంది. ఇందులో భాగంగా ప్రతి రోజూ అన్నం, గుడ్డు, పాలతో పాటు పప్పు, వివిధ రకాల కూరగాయలు, సాంబారుతో వండి పెడుతున్నారు. అదనంగా మురుకులు, బాలమృతం కూడా అందజేస్తున్నారు. దీంతో పాటు వారానికి రెండు సార్లు ఎగ్ బిర్యానీ పెట్టాలని ప్రభుత్వం జూన్ మొదటివారంలో నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జూన్ 11వ తేదీన పథకాన్ని ప్రారంభించారు. మొదటి రోజు సంక్షేమ శాఖ అధికారులు సైతం పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా ఎగ్ బిర్యానీ వడ్డించారు. కాగా మొదటి రోజు సొంత ఖర్చులతో వండిపెట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఆ తరువాత చేతులెత్తేశారు. దీంతో ఈ పథకం ఒక్క రోజుకే పరిమితమైంది.

కారణాలివీ..

ఎగ్ బిర్యానీ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించిన ప్రభుత్వం.. కొనసాగించేందుకు సరైన కార్యాచరణ రూపొందించలేదు. దీనికి తోడు నిధులు కేటాయించకపోవడం, చేతినుంచి ఖర్చు చేయాల్సి వస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్లు ఆర్థికభారంగా భావించారు. పైగా మెనూలో ఎగ్ బిర్యానీ చేర్చలేదని, ప్రారంభం రోజు తామే సొంత ఖర్చులతో వంటకాలు వండి పెట్టామని, తదపరి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామని చెబుతున్నారు.

లబ్ధిదారులు ఇలా..

జిల్లాలో భువనగిరి, ఆలేరు, మోత్కూరు, రామన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. బాలింతలు 3,680, గర్భిణులు 4,219, చిన్నపిల్లలు 12,420 మంది ఉన్నారు. వీరందరికీ ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా ప్రతి రోజూ పోషకాహారం అందిస్తున్నారు.



భువనగిరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారుల కోసం చేసిన ఎగ్ బిర్యానీ (ఫైల్)

స్పష్టమైన ఆదేశాలు రాలేదు

ఎగ్ బిర్యానీ పథకాన్ని ప్రభుత్వ మౌఖిక ఆదేశాల మేరకు జూన్ 11న ప్రారంభించాం. మొదటి రోజూ సొంత ఖర్చులతోనే వంటకాలు చేయడం జరిగింది. ఇంకా మెనూలో చేర్చలేదు. పథకం కొనసాగింపునకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదు.

–నర్సింహారావు, జిల్లా సంక్షేమ అధికారి

పాడి రైతులకు బిల్లులు ఆపడం అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పాడి రైతులు, అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు


- ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో పాడి రైతుల ధర్నా

భువనగిరిటౌన్ : ఎనిమిది నెలలుగా పాల బిల్లులు ఇవ్వకపోవడంతో పాడి పశువుల పోషణ భారంగా మారుతుందని పాడి రైతులు, రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడికుమార్ మాట్లాడుతూ పాల బిల్లులు ఆపడం వల్ల పాడి రైతులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంస్థ ఉన్నతాధికారులు, పాలకవర్గం అక్రమాలకు పాల్పడి లాభాల్లో నడిచిన డెయిరీని బిల్లులు చెల్లించలేని స్థితికి దిగజార్చారని ఆరోపించారు. పాడి రైతులకు బిల్లులు చెల్లించడంతో పాటు సంస్థ లాభాల బాట పట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జనార్దన్, కొలనుపాక పాల సొసైటీ చైర్మన్ మామిడాల సోమయ్య, ఇక్కుర్తి పాల సొసైటీ చైర్మన్ చిరబోయిన రాజయ్య, ఆయా గ్రామాల పాడి రైతులు అయినా యాకయ్య గడ్డం నాగరాజు పిన్నపురెడ్డి రాఘవరెడ్డి, బర్మ బాబు, రామచంద్రు ఓరుగంటి మైసయ్య, మామిడాల బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను సర్వే చేయండి

- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి: హెచ్‌ఎండీ పరిధిలో ఉన్న చెరువులను సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ కట్టడాలను గుర్తించాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎండీఏ మండలాల పరిధిలో ఉన్న చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ తదితర వివరాలపై సమీక్షించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో కొన్ని చెరువులు నిండి ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వివిధ కట్టడాలు చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలిసిందన్నారు. అటువంటి వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాలి ఆదేశించారు. అంతేకాకుండా కుంటలను సైతం ఆక్రమించి లేఅవుట్‌లు చేస్తున్నారని, వాటిని కూడా సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

నూతన గోదాముల నిర్మాణం

భవిష్యత్ అవసరాల దృష్ట్యా నూతన గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి అధికారుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉన్న గోదాములు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదన్నారు. గ్రీన్ స్టోరేజ్ స్కీం ద్వారా సహకార సంఘాల కోసం 40వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు నిర్మించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. రైలు, రోడ్డు మార్గాలకు దగ్గరగా నాబార్డు ఆర్థిక సహాయంతో నిర్మాణం చేస్తామన్నారు.

నాలాల చుట్టూ ఆక్రమణల గుట్టు

గుర్తింపునకు రంగం సిద్ధం

- సర్వే చేయడానికి రెవెన్యూ, మున్సిపల్ శాఖల సన్నాహాలు
- ఆక్రమణదారులకు త్వరలో నోటీసులు జారీ
- రైల్వేట్రాక్ కింద పూడుకుపోయిన నాలా విషయమై ఆ శాఖ ఉన్నతాధికారులకూ లేఖలు

సాక్షి ఎఫెక్ట్..

ఆలేరు: పట్టణంలో ప్రధాన నాలాల ఆక్రమణల గుర్తింపునకు రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సంయుక్త సర్వే చేయడానికి సిద్ధమవుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొందరు ఇష్టానుసారంగా వెంచర్లు చేయడం, మరికొందరు నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టం వల్ల ఆక్రమణలు జరిగినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. తద్వారా నాలాలు ఇరుకుగా మారి, వరద ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆలేరు పట్టణంలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, వస్తువులు, దుస్తులు తడవడంతో పాటు రాత్రంతా నిద్రలేకుండా గడిపారు. ఏటా వానాకాలం ఇదే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో ముంపు కాలనీల సమస్యలపై 'ఏటా ముంపు..ఏదీ కనువిప్పు' శీర్షికతో ఈనెల 15వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈమేరకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఆక్రమణలను గుర్తించేందుకు సిద్ధమవుతున్నారు. రెవెన్యూ రికార్డుల్లో నాలాల వైశాల్యం, నాలాల బఫర్‌జోన్ నిబంధనలను పరిశీలిస్తున్నారు. నాలాల సమీపంలో నిబంధనల ప్రకారమే కట్టడాలు చేశారా? ఈ మేరకు ఆక్రమణలు జరిగాయనే అంశాలపై సర్వే చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



ఆలేరు పట్టణంలో ఆక్రమణలతో కుంచించుకుపోయిన నాలా


8 కి.మీ పొడవునా నాలా

బైరవకుంట, పత్రేకాల్వ నుంచి శ్రీరామకృష్ణ విద్యాలయం వరకు సుమారు 8 కిలో మీటర్ల పొడవు ప్రధాన నాలాలు ఐదు వరకు ఉన్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఆయా కుంటలు పొంగితే వరదనీరంతా ఆయా నాలాల మీదుగా బైపాస్ సమీపంలోని పెద్ద వాగులో కలవాలి.

సమస్య ఇదీ..

పాత మున్సిపల్ కార్యాలయం, బ్రహ్మంగారి గుడి, కొలనుపాక రోడ్డు, రైల్వేట్రాక్, ఆలేరు ప్రధాన రోడ్డు పక్కన వరద సాఫీగా ముందుకు వెళ్లడంలేదు. ఫలితంగా 11,12 వార్డుల పరిధిలో రంగనాయకుల వీధి, కుమ్మరివాడ, బొడ్రాయి తదితర కాలనీలు ముంప బారిన పడటం తెలిసిందే.


పరిశీలిస్తున్నాం



రెవెన్యూ రికార్డుల్లో నాలాల వివరాలను పరిశీలన చేస్తున్నాం. అనంతరం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి వివరణ కోరుతాం. అన్ని అంశాల పరిశీలన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– అంజనేయులు, తహసీల్దార్, ఆలేరు

రైల్వే శాఖకు లేఖలు రాశాం



రెవెన్యూ శాఖతో కలిసి నాలాల ఆక్రమణల గుర్తింపునకు సర్వే చేయనున్నాం. ఆలేరు ప్రధాన రోడ్డు పక్కన ఉన్న రైల్వే ట్రాక్ కింద కల్వర్టు వద్ద వరద నీరు వెళ్లడం లేదు. మరమ్మతుల కోసం రైల్వే ఉన్నతాధికారులకు లేఖలు రాశాం. వారి నుంచి క్లియరెన్స్ రాగానే పనులు మొదలవుతాయి. రైల్వే అధికారులతో కలెక్టర్ కూడా సంప్రదింపులు చేస్తున్నారు.

– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఆలేరు

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు ఆగమ శాస్త్రం ప్రకారం అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభూలు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు జరిపించారు. వివిధ పూజలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.



ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న అర్చకుడు

క్లుప్తంగా

చికిత్స పొందుతూ మృతి


అనిల్ (ఫైల్)

అర్వపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహడ్ గ్రామానికి చెందిన ఉప్పుల అనిల్‌కుమార్(34) గత నెల 3న బైక్‌పై తన పొలం నుంచి ఇంటికి వస్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు.

పల్లె ప్రకృతి వనం బోర్డు చోరీ


దొంగిలించబడిన పల్లె ప్రకృతి వనం బోర్డు (ఫైల్)

మిర్యాలగూడ: దామరచర్ల మండలం రాజగట్టు గ్రామం పల్లె ప్రకృతి వనం మెయిన్ గేట్‌కు ఉన్న బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేసి దొంగిలించారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. గత 20 నెలలుగా గ్రామ కార్యదర్శి, అధికారులు పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి బోర్డు దొంగిలించిన వ్యక్తులను అరెస్ట్ చేసి పల్లె ప్రకృతి వనం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

ఎంజీయూ వాలీబాల్ పోటీల విజేత ఎంఎంఆర్ కళాశాల

నల్లగొండ: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ విద్యార్థులకు యూనివర్సిటీలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని ఎంఎంఆర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా. హరీష్‌కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ అక్బల్ అలీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు మురళి, శ్రీనివాసరెడ్డి, పలు కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు చేయూత

- 'పీఎం స్వానిధి' స్థానంలో లోక్ కల్యాణ్ పథకాన్ని తీసుకొచ్చిన కేంద్రం
- గతంలో దరఖాస్తు చేసుకుని రుణం పొందని వారికి రుణ సదుపాయం పెంపు
- కొత్తవారికీ అవకాశం
- అక్టోబర్ 2 వరకు దరఖాస్తుల స్వీకరణ
- లోక్ కళ్యాణ్ మేళాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్న అధికారులు



మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం తీసుకొచ్చింది. కరోనా సమయంలో పీఎం స్వానిధి పథకం కింద చిరు వ్యాపారులకు రుణాలు అందించగా ప్రస్తుతం ఆ పథకాన్ని నిలిపివేసి చేసి దాని స్థానంలో లోక్ కల్యాణ్ పథకాన్ని తీసుకొచ్చారు. గతంలో రుణాలు పొందని చిరు వ్యాపారులకు ఈ పథకం కింద రుణాలు మంజూరు చేయనున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు మున్సిపాలిటీల్లో లోక్ కల్యాణ్ మేళాలు ఏర్పాటు చేసి వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. అక్టోబర్ 2వ తేదీ లోగా ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి రుణ మంజూరు కోసం బ్యాంకర్లకు అందజేయనున్నారు.

నిలిచిపోయిన పీఎం స్వనిధి పథకం..

ఐదేళ్ల క్రితం కరోనా కారణంగా వీధి వ్యాపారులు ఇబ్బందుల్లో పడ్డారు. కేంద్ర ప్రభుత్వం వారికి ఆర్థికంగా చేయూత అందించేందుకు పీఎం స్వానిధి పథకాన్ని ప్రారంభించింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల సర్వే నిర్వహించి అర్హులైన వారిని గుర్తింపు కార్డులు అందించింది. మొదటి విడతలో రూ.10 వేలు, రెండో విడతలో రూ.20వేల వరకు రుణాలు అందించారు. తీసుకున్న రుణం తిరిగి చెల్లించిన వారికి రూ.50 వేల వరకు రుణాలు ఇచ్చారు. అయితే ఈ పథకం నిలిచిపోవడంతో గతంలో దరఖాస్తులు చేసుకున్న కొందరికి రుణాలు అందించలేదు. వారి కోసం లోక్ కల్యాణ్ పథకాన్ని తీసుకొచ్చింది.

రుణ సదుపాయం పెంపు

మిర్యాలగూడ మున్సిపాలిటీలో మొత్తం 10వేల మందికి పైగా వీధి వ్యాపారులు ఉన్నట్లు మెప్మా అధికారులు గుర్తించారు. వీరిలో 8893 మంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా.. పీఎం స్వానిధి పథకం కింద 5380 మంది గతంలో రుణాలు పొందారు. మిగిలిన వారికి రుణాలు మంజూరు కాలేదు. మరికొందరు రెండోసారి దరఖాస్తు చేసుకున్నప్పటికీ రుణం మంజూరు కాలేదు. బ్యాంకర్లు వివిధ కారణాలతో తిరస్కరించారు.

కొత్తవారు సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రం పీఎం స్వానిధి పథకం స్థానంలో లోక్ కల్యాణ్ పథకం అమలు చేస్తోంది. గతంలో పీఎం స్వానిధి పథకానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ రుణాలు పొందని చిరు వ్యాపారులకు లోక్ కల్యాణ్ పథకం ద్వారా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. కొత్తవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పోతేపాక బక్కయ్య, టౌన్ మిషన్ కోఆర్డినేటర్, మిర్యాలగూడ

కేంద్ర ప్రభుత్వం లోక్ కళ్యాణ్ పథకం తీసుకొచ్చి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మెప్మా అధికారులు మున్సిపాలిటీల్లో లోక్ కల్యాణ్ మేళాలు ఏర్పాటు చేసి కొత్తవారి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. గతంలో రూ.10 వేలకు దరఖాస్తు చేసుకున్నవారికి రూ.15వేలు, రూ.15వేలకు దరఖాస్తులు చేసుకున్నవారికి రూ.25వేల వరకు రుణాలు ఇవ్వనున్నారు. అదే విధంగా రూ.50వేల వరకు రుణాలు తీసుకునే ప్రతి ఒక్కరికి క్రెడిట్ కార్డులు ఇవ్వనున్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో అక్టోబరు 2వ తేదీ వరకు కొత్తవారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. నూతనంగా దరఖాస్తు చేసుకునే వారు వారి దుకాణానికి సంబంధించిన ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలి.

రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


బాధితుడు సాయిసిద్ధును పరామర్శిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ: రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, పోలీసులను అడ్డం పెట్టుకొని సీఎం రేవంతరెడ్డి పాలన కొనసాగిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. యూరియా కోసం ధర్నా చేస్తే తనను నడవలేని స్థితిలో పోలీసులు కొట్టారని ఆరోపించిన దామరచర్ల మండలం కొత్తపేటతండాకు చెందిన ధనావత్ సాయిసిద్ధును బుధవారం జగదీష్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ.. యూరియా కోసం ధర్నా చేస్తే దళితుడు అని కూడా చూడకుండా పోలీసులు విచక్షణారహితంగా కొడతారా అని ప్రశ్నించారు. సాయిసిద్ధును విపరీతంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకోవాల్సిన జిల్లా ఎస్పీ.. పోలీసులను వెనుకేసుకుని వస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ఎస్పీలు కూడా కాంగ్రెస్ నాయకుల్లా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. జిల్లాలో అమాయకులను అక్రమ కేసుల్లో ఇరికించి కొడుతున్నారని అన్నారు. రైతులకు కనీసం యూరియా ఇవ్వలేని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందన్నారు. అడవిదేవులపల్లిలో యూరియా కోసం లైన్‌లో నిలబడి గాయపడిన గిరిజన మహిళా రైతు చికిత్స పొందుతూ మృతిచెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు యూరియా అందించకుండా కాంగ్రెస్ నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు. మిర్యాలగూడలో యూరియా లారీలను పక్కదారి పట్టిస్తున్నారని, ఎమ్మెల్యేలే యూరియా దందా చేస్తున్నారని అన్నారు. బాధితుడు సాయిసిద్ధును, అతడి కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని, బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్, తిప్పన విజయసింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నల్లమోతు సిద్ధార్థ, దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బాలాజీనాయక్, ఆంగోతు హాతీరాంనాయక్, కుందూరు వీరకోటిరెడ్డి, బాబయ్య, కుర్ర శ్రీనునాయక్, ధనావత్ ప్రకాశ్‌నాయక్, లింగానాయక్, పీసీకే ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆరోపణలు అవాస్తవం

నల్లగొండ: వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో యువకుడిపై ఎస్ఐ థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బుధవారం కొన్ని వార్తాపత్రికల్లో వచ్చిన వార్త అవాస్తవమని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వార్త రాయొద్దని ఆయన కోరారు.

గొర్రెలను అపహరిస్తున్న ఇద్దరి అరెస్ట్

- 15 గొర్రెలు, రెండు కార్లు స్వాధీనం

యాదగిరిగుట్ట రూరల్: గొర్రెలను అపహరిస్తున్న ఇద్దరు దొంగలను యాదగిరిగుట్ట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. వారం రోజుల క్రితం యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో గుర్తుతెలియని వ్యక్తులు తమ గొర్రెలను దొంగిలించారని పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం యాదగిరిగుట్ట మండలం వంగపల్లి కమాన్ వద్ద ఎస్ఐలు యాదయ్య, సి. కృష్ణస్వామి, క్రైమ్ సిబ్బంది బి. కిరణ్, నాగరాజు, శ్రీకాంత్, సాయి, గణేష్ వాహనాలు తనిఖీలు చేస్తుండగా.. కరీంనగర్ జిల్లా కేశవపట్నం గ్రామానికి చెందిన గొల్లెన కుమార్ అలియాస్ కుమారస్వామి, కింసారపు శేఖర్ అలియాస్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారం క్రితం తమతో పాటు మరో ఎనిమిది మంది కలిసి గొర్రెలను దొంగిలించినట్లు నిజం ఒప్పుకున్నారు. వారి నుంచి 15 గొర్రెలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. పట్టుబడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని, మరో 8 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐలు యాదయ్య, కృష్ణస్వామితో పాటు పోలీస్ సిబ్బందిని ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ భాస్కర్ అభినందించారు.

'రీజినల్' అలైన్‌మెంట్ మారుస్తామని మోసం చేశారు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య


చౌటుప్పల్ రూరల్: మందోళ్లగూడెంలో రీజినల్ రింగ్ రోడ్డు బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎస్. వీరయ్య

చౌటుప్పల్ రూరల్ : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా అలైన్‌మెంట్ ఖరారు చేస్తే.. తాము అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మార్చుతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న చౌటుప్పల్ మండలంలోని మందోళ్లగూడెం, సింగరాయచెర్వు, తూర్పుగూడెం గ్రామ రైతులతో పాటు సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక, శేరిగూడెం గ్రామాల్లో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ రింగ్ రోడ్డులో రైతులు కోల్పోతున్న భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కనీసం గ్రామసభలు నిర్వహించకుండా ఏకపక్షంగా భూములు లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం మార్కెట్ ధర కూడా ఇవ్వకుండా రైతుల పట్ల అమానుషంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 40కి.మీ. దూరంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేస్తామని చెప్పి చౌటుప్పల్ మార్గంలో కేవలం 28కి.మీ. దూరంలోనే రోడ్డు నిర్మించడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అలైన్‌మెంట్ మార్చడం కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్నా కూడా రైతులను మోసం చేసేలా బీజేపీ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 27న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ జహంగీర్, బూరుగు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోరెం నర్సిరెడ్డి, సప్పిడి లక్ష్మారెడ్డి, నాయకులు జీ. శ్రీనివాస్‌చారి, దోడ యాదిరెడ్డి, దొంతగోని పెద్దులు, కొండే శ్రీశైలం, సప్పిడి రాఘవరెడ్డి, బోరెం శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధం

గరిడేపల్లి: షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ దగ్ధమైంది. ఈ ఘటన గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్య నాగరాజు అనే వ్యక్తి గడ్డిపల్లి గ్రామంలో నందిని బేకరీ షాపు నిర్వహిస్తున్నాడు. నాగరాజు, అతడి భార్య ఇద్దరు కలిసి బేకరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో అకస్మాత్తుగా బేకరీలో షార్ట్ సర్క్యూట్‌తో జరిగి పొగలు వచ్చాయి. కొద్దిసేపటికే బేకరీ మొత్తం దగ్ధమైంది. ఫర్నీచర్‌తో పాటు సుమారు రూ.5లక్షల విలువైన వస్తువులు కాలిపోయాయని బాధితుడు వాపోయాడు.

బైక్ ఢీకొని మృతి



మిర్యాలగూడ: దామరచర్ల మండలం వీరభద్రపురం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందినట్లు వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

మాలల రణభేరిని విజయవంతం చేయాలి

- మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య


మాలల రణభేరి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాలమహానాడు సభ్యులు

సూర్యాపేట అర్బన్: ఎస్సీ వర్గీకరణలో తమకు జరిగిన అన్యాయంపై పోరాడేందుకు హైదరాబాద్‌లో నవంబర్ 2న నిర్వహించనున్న మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో సూర్యాపేట జిల్లా మాలమహానాడు అధ్యక్షుడిగా పెన్‌పహాడ్ మండలం అనాజీపురం గ్రామానికి చెందిన బొల్లెద్దు వినయ్‌కి నియామకపత్రం అందజేశారు. అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా 2011 జనాభా లెక్కలతో చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా జనగణన చేపట్టకుండానే మాలలకు 5శాతం, మాదిగలకు 9శాతం రిజర్వేషన్ ఇచ్చి రోస్టర్ పాయింట్లు పెట్టడంతో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రోస్టర్ పాయింట్లను సవరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపించారు. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగాల్లో మాలలకు 28 పోస్టులుంటే మాదిగలకు 100 పోస్టులున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును పునఃసమీక్షించి జీఓ 99ని సవరించి మాలలతో పాటు గ్రూప్–3లో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుతం జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని, మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించాలని, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేసి నిధులు ఖర్చు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాలల రణభేరి మహాసభకు మాల ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని లేని పక్షంలో వారి ఇళ్లు ముట్టడిస్తామన్నారు. మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణ చేసి మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని, మాలలకు అనుకూలంగా లేని ఏ పార్టీకైనా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం మాలల రణభేరి కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన పంగరెక్క సంజయ్‌కి నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, మాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పర్వి కోటేశ్వరరావు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు లక్మాల మధుబాబు, ప్రకాష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చప్పిడి సావిత్రి, పాలపాటి సుమలత, యాదాద్రి జిల్లా మహిళా అధ్యక్షురాలు కె. లలిత, సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్కసైదులు పాల్గొన్నారు.

అక్రమంగా ఆటోల్లో యూరియా తరలిస్తుండగా అడ్డగింత

- ఎర్రవరం గ్రామంలో ఘటన

కోదాడ : కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం పీఏసీఎస్ నుంచి అక్రమంగా యూరియాను తరలిస్తున్న రెండు ఆటోలను బుధవారం గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఎర్రవరం పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు అతనికి కావాల్సిన వారికి, బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకునేందుకు కొంతకాలంగా అక్రమంగా యూరియా తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. గోదాముకు వచ్చిన యూరియాను మంగళవారం రాత్రే తరలించేందుకు రెండు ఆటోలు రాగా వాటిని అడ్డుకుని బస్తాలను కిందకు దించినట్లు రైతులు పేర్కొన్నారు. అయితే బుధవారం ఉదయం తిరిగి మళ్లీ రెండు ఆటోల్లో 21 బస్తాలను లోడ్ చేసి పంపిస్తుండగా వాటిని అడ్డుకుని డబ్బులిచ్చి క్యూలో నిలబడిన స్థానిక రైతులు తీసుకెళ్లారు. పీఏసీఎస్ పరిధిలోని రైతులు గంటల తరబడి క్యూలో నిలబడితే ఒకటి రెండు బస్తాల యూరియాను ఇస్తున్న సిబ్బంది సంఘంతో సంబంధం లేని వారికి 21 బస్తాలను ఎలా ఇస్తారని ప్రశ్నించారు. యూరియా అక్రమంగా తరలించేందుకు సహకరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై పీఏసీఎస్ చైర్మన్‌ను వివరణ కోరగా.. తనపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరిడేపల్లి: గరిడేపల్లి మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గరిడేపల్లిలోని గుండాల మిట్ట ప్రాంతంలో గల బస్తాల కంపెనీలో పనిచేస్తున్న ఎలగోల యేసు స్థానికంగా ఉన్న గుండాలమ్మ దేవాలయం వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కాగా.. స్థానికులు హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ ఏసీపీ పి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ర్యాగింగ్ వలన విద్యార్థుల భవిష్యత్తు నాశనం కావడమే కాకుండా సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను దూరంగా ఉండాలని కోరారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నియంత్రణకు యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ కమిటీలు, స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. నూతనంగా చేరిన విద్యార్థుల పట్ల ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ప్రతిఒక్కరూ ర్యాగింగ్ సంస్కృతిని నిర్మూలించుటకు కృషి చేయాలని కోరారు. ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్ నేరాలపై 1930 లేదా 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఫొటో మార్ఫింగ్ వంటి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుబ్బారావు, స్థానిక ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి, సైబర్ వారియర్ అంకిత, యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ మారగోని వెంకటేశం ఆయా విభాగాల డీన్లు, హెచ్ఓడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై కేసు

నల్లగొండ: నిబంధనలు పాటించని కారణంగా నల్లగొండ సమీపంలోని కంచనపల్లి గ్రామంలో గల వెంకటేశ్వర మద్యం దుకాణంపై ఎక్సైజ్ అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. దుకాణ భాగస్వాముల మధ్య గొడవలతో మద్యం దుకాణాన్ని ఇటీవల మూసివేశారు. దీంతో ఎక్సైజ్ శాఖకు ఆర్థికంగా నష్టం జరుగుతున్నందున ఎక్సైజ్ సీఐ ప్రసాద్ మద్యం దుకాణంపై కేసు నమోదు చేశారు.


'మదర్ డెయిరీ' బరిలో తొమ్మిది మంది

- పాలకవర్గ సభ్యుల నియామకానికి 27న పోలింగ్
- మహిళా రిజర్వేషన్ స్థానంలో నలుగురు..
- రెండు అన్‌రిజర్వ్‌డ్ స్థానాలకు ఐదుగురు పోటీ

హయత్‌నగర్: నల్లగొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమాఖ్య లిమిటెడ్(నార్ముల్ మదర్ డెయిరీ) పాలకవర్గ ఎన్నికల్లో తొమ్మిది మంది బరిలో నిలిచారు. డెయిరీలో ఖాళీగా ఉన్న ముగ్గురు సభ్యుల నియామకం కోసం దాఖలు చేసిన నామినేషన్ల ఉపసంహరణ, స్క్రూటినీ అనంతరం తొమ్మిది మంది తుది పోటీలో ఉన్నారు. మహిళా రిజర్వేషన్ స్థానానికి కర్నాటి జయశ్రీ, గుంట్ల రాధిక, మోతె పూలమ్మ, సూదగాని విజయ తలపడనున్నారు. మిగిలిన రెండు అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో కుంచాల ప్రవీణ్‌రెడ్డి, పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, శీలం వెంకటనర్సింహారెడ్డి, సందిల భాస్కర్‌గౌడ్ పోటీ పడుతున్నారని ఎన్నిల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఉదయం 8గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగుతుందని చెప్పారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు, విజేతలను ప్రకటించనున్నట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికయ్యే పాలకవర్గ సభ్యులు అక్టోబర్ 1వ తేదీన బాధ్యతలు చేపడతారని వెల్లడించారు. అర్హులైన సొసైటీల చైర్మన్లు తమ ఐడీ కార్డుతో వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు.

నిజాయితీ చాటుకున్న పెట్రోల్ బంక్ సిబ్బంది


- రూ.2 లక్షల విలువైన బంగారం, వెండి ఉన్న బ్యాగు బాధితుడికి అప్పగింత


బ్యాగును బాధితుడికి అప్పగిస్తున్న పెట్రోల్ బంక్ సిబ్బంది

హాలియా: పెట్రోల్ బంక్‌లో పోగొట్టుకున్న రూ.2 లక్షల విలువైన బంగారం, వెండిని బాధితులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు పెట్రోల్ బంక్ సిబ్బంది. ఈ సంఘటన హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఏఎస్ఐ రామయ్య, బంక్ మేనేజర్ సోమన బోయిన లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22న పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కవిటి బ్రహ్మచారి హాలియాలోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకున్నాడు. అనంతరం అదే బంక్‌లో బైక్ టైర్లలో గాలి చెక్ చేయించుకునే క్రమంలో బంగారం, వెండి ఉన్న బ్యాగ్‌ను బంక్‌లో ఉంచి వెళ్లిపోయారు. బంక్ సిబ్బంది గమనించి బ్యాగ్‌ను బంక్ మేనేజర్ లింగయ్యకు అప్పగించారు. బ్యాగులో దొరికిన వివరాల ఆధారంగా బ్యాగ్ బ్రహ్మచారిదని తెలుసుకొని హాలియా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో బుధవారం బ్రహ్మచారికి బ్యాగ్‌ను తిరిగి అప్పగించారు. నిజాయితీ చాటుకున్న బంక్ సిబ్బందికి బ్రహ్మచారి కృతజ్ఞతలు తెలుపగా.. పోలీసులు అభినందించారు.

పోలీసులపై దాడిచేసిన వలస కార్మికుల అరెస్ట్

- 15 మంది రిమాండ్
- ఒకరు పరార్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : పాలకవీడు మండలం దక్కన్ సిమెంట్ పరిశ్రమ వద్ద పోలీసులపై దాడికి పాల్పడిన కార్మికులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో సీఐ చరమందరాజు కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం మహంకాళిగూడెం గ్రామ పరిధిలోని దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఈ నెల 21న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు వినోద్ గుండెపోటుతో మృతిచెందాడు. అతడి మృతికి రూ.20లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన కార్మికులు 22వ తేదీన ఆ ఫ్యాక్టరీ మెయిన్ గేట్ ముందు బైఠాయించారు. వాహనాలను, మనుషులను లోపలకు, బయటకు వెళ్లకుండా ధర్నాను దిగారు. యాజమాన్యం సమాచారం మేరకు పాలకీడు ఎస్ఐ కోటేష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఏదైనా సమస్య ఉంటే యాజమాన్యంతో మాట్లాడి సామరస్యంగా పరిష్కరించుకోవాలని ధర్నా చేస్తున్న వారిని సముదాయించారు. ఇంతలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఖేష్ ప్రసాద్, మంజీత్ కుమార్, మన్సూర్ అలం, శక్తి చౌహాన్, రవిశంకర్ సహానీ, కిసాన్ సహానీ, ధనంజయ్, కమలేష్ యాదవ్, ఉమేష్‌కుమార్‌యాదవ్‌తో పాటు బిహార్‌కు చెందిన పొల్దార్, విక్రమ్ కుమార్, అభిషేక్ కుమార్, రాహుల్ కుమార్, మన్సూర్ అన్సారీ, సచిన్ విశ్వకర్మతో పాటు మరికొంత మంది వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి కర్రలు, రాళ్లతో ఎస్ఐ, పోలీస్ సిబ్బందిపై దాడికి దిగారు. దీంతో ఎస్ఐ కోటేష్, హోంగార్డు గోపికి గాయాలు కాగా పోలీసు వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎస్ఐ ఫిర్యాదు మేరకు మేరకు సీఐ చమందరాజు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన వ్యక్తులను గుర్తించి మంగళవారం విష్ణుపురం రైల్వే స్టేషన్ వద్ద నలుగురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. వారిని విచారించి మిగతా వారిని పరిశ్రమలోని లేబర్ కాలనీలో పట్టుకోగా.. ఒకరు పరారయ్యారు. వారి వద్ద నుంచి కర్రలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పారిపోయిన వ్యక్తిని కూడా త్వరలో పట్టుకుంటామని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా విడిచిపెట్టేది లేదని సీఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



26 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాగర్‌కు భారీగా వరద

నాగార్జునసాగర్ : ఎగువనుంచి సాగర్‌కు వరద ఉధృతి పెరుగుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి 3,66,694 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేతుండగా అంతేనీటిని విడుదల చేస్తున్నారు. 26 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా 3,20,046 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 32,764 క్యూసెక్కులు మొత్తం 3,52,810 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి వదులుతున్నారు. కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 13,884 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

పులిచింతల 12గేట్లు..

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా వచ్చిచేరుతోంది. 3,74,746 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా.. అధికారులు ప్రాజెక్టు 12 గేట్లను నాలుగు మీటర్ల మేరకు ఎత్తి 3,82,397 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తెలంగాణ వైపు ఉన్న విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు 10,376 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు ఏడు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 10,679 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలకు 4.14 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎస్సారెస్పీ భూములు ఆక్రమిస్తే చర్యలు

కోదాడ: ఎస్సారెస్పీ కాల్వల భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా నీటి పారుదల శాఖ ఈఈ యాదగిరి హెచ్చరించారు. మోతె మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో ఎస్సారెస్పీ కాల్వకు ఇరువైపులా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని ఫిర్యాదు అందడంతో బుధవారం పరిశీలించారు. అనంతరం ఈఈ మాట్లాడుతూ భూమి కొలతల వివరాలు సర్వేయర్ వద్ద నుంచి సేకరించి ఆక్రమణకు గురైన భూమి వివరాలు తెలియజేస్తామన్నారు. ఆయన వెంట డీఈ రమేష్, కాంగ్రెస్ మండల నాయకులు ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

చిరుధాన్యాల బతుకమ్మ



నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో బుధవారం వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో ఆకట్టుకున్న చిరుధాన్యాలతో చేసిన బతుకమ్మ

-సాక్షి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్, నల్లగొండ

బీసీలు రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలి



బండి సాయన్నగౌడ్‌ను సత్కరిస్తున్న సైదులుగౌడ్

చిట్యాల: బీసీలు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని గోపా(గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్నగౌడ్ పిలుపునిచ్చారు. చిట్యాలలో బుధవారం గోపా జిల్లా అధ్యక్షుడు దంతూరి సైదులుగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో అవకాశాలు కల్పించాలన్నారు. గోపా సభ్యులంతా బీసీల్లో చైతన్యం తీసుకొచ్చేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అనంతరం బండి సాయన్నగౌడ్‌ను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనగాం రవీందర్‌గౌడ్, యల్మకంటి మీరయ్యగౌడ్, రేగుల గడ్డ నర్సింహగౌడ్, కప్పల రాజీవ్‌గౌడ్, సిద్దగోని పరమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఐతగోని లాల్ బహదూర్‌గౌడ్, వట్టికూటి గురుమూర్తి, జిల్లా కోశాధికారి పోలగోని వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పోగుల నగేష్‌గౌడ్, సలహాదారుడు దూసరి కిరణ్‌గౌడ్, పంతంగి కరుణాకర్‌గౌడ్, రాచకొండ జానయ్యగౌడ్, ఉయ్యాల వెంకటేష్ పాల్గొన్నారు.

నిమ్మ ధర.. నెమ్మది!

- నెల క్రితం బస్తా నిమ్మకాయల రేటు రూ.1000, ఇప్పుడు రూ.400 లోపే..
- భారీగా పెరిగిన నిమ్మ దిగుబడులు
- వర్షాలతో తగ్గిన అమ్మకాలు
- పెట్టుబడులు కూడా వెళ్లడం లేదని రైతుల ఆవేదన



నకిరేకల్ మార్కెట్‌లో నిమ్మ బస్తాలు



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

నకిరేకల్ : వరుసగా కురుస్తున్న వర్షాలు నిమ్మ రైతులను కుదేపిస్తున్నాయి. ఈ ఏడాది నిమ్మ దిగుబడులు అధికంగా రావడంతో ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. బుధవారం రాత్రి నకిరేకల్ నిమ్మ మార్కెట్‌కు రైతులు సుమారు 30 వేల బస్తాల నిమ్మకాయలు తీసుకురావడంతో యార్డు మొత్తం కిక్కిరిసిపోయింది. నెల రోజుల క్రితం పండుకాయ బస్తాకు రూ.800, పెద్ద సైజు కాయకు బస్తాకు రూ.1000, పారే కాయ(చిన్న సైజు)కు బస్తాకు రూ.600 ధర లభించింది. పది రోజుల నుంచి ధరలు సగానికి సగం పడిపోయాయి. నకిరేకల్ నిమ్మ మార్కెట్‌లో ప్రస్తుతం బస్తా ధర రూ.200 నుంచి రూ.400 మించడం లేదు.

ఇతర రాష్ట్రాల్లో తగ్గిన డిమాండ్

నిమ్మ కాయలు ఎక్కువగా ఎగుమతి అయ్యే ఢిల్లీ, పంజాబ్, గుజరాత్, కర్నాటక తదితర రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తుండడంతో అక్కడ కొనుగోళ్లు తగ్గాయి. మరోవైపు ఇక్కడ వారంలో మూడు నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తుండడంతో చెట్ల మీద కాయలు రాలుతున్నాయి. దీంతో చిన్న, పెద్ద అనే తేడా లేకుండా రైతులు కాయలను కోయడంతో దిగుబడులు పెరిగి నకిరేకల్ నిమ్మ మార్కెట్ అంతా బస్తాలతో నిండిపోతోంది. ధర లేకపోవడంతో కొందరు రైతులు మార్కెట్ ఆవరణలోనే నిమ్మ కాయలను పారబోస్తున్నారు.

రోజుకు 20 వేల బస్తాలు రాక

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 30వేల ఎకరాలపైనే నిమ్మతోటలు సాగవుతున్నాయి. .దాదాపు 20 వేల రైతు, కౌలుదారుల కుటుంబాలు నిమ్మ తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో నకిరేకల్‌లో మాత్రమే నిమ్మ మార్కెట్ ఉంది. ఇక్కడ రోజూ 20 వేల నుంచి 25 వేల బస్తాల కాయలు వస్తాయి. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు నిమ్మ వ్యాపారం సాగుతుంది. నకిరేకల్ నిమ్మ మార్కెట్‌కు నెల క్రితం వరకు ప్రతి రోజూ 5 వేల నుంచి 10 వేల బస్తాల నిమ్మ దిగుబడులు వచ్చేవి. పదిహేను రోజుల నుంచి 20 వేల నుంచి 25 వేల బస్తాల వరకు వస్తున్నాయి. ఓ వైపు దిగుబడి పెరగడం, మరోవైపు అమ్మకాలు పడిపోవడంతో నిమ్మ ధరలు తగ్గాయి.

పెట్టుబడులు కూడా రావడం లేదు



నేను మూడు ఎకరాల్లో నిమ్మ సాగు చేశాను. ప్రస్తుతం నిమ్మ ధర లేకపోవడంతో తోటలకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. నిత్యం వర్షాలు కురవడంతో చెట్లమీద కాయలు రాలుతున్నాయి. దానివల్ల కాయలన్నీ కోయక తప్పడం లేదు. మార్కెట్‌లో బస్తా ధర రూ. 200 నుంచి రూ.400 వరకే వస్తోంది. ధరలేక మార్కెట్‌కు తెచ్చిన నిమ్మ కాయలను పారబోయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

– గజ్జి వీరభద్రం, రైతు, పెర్కకొండారం, శాలిగౌరారం మండలం

దిగుబడులు పెరిగాయి



ఇతర రాష్ట్రాల్లో వర్షాల ప్రభావం నిమ్మ ధరలపై పడుతోంది. మరోవైపు నిమ్మ దిగుబడులు బాగా పెరిగాయి. నకిరేకల్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా నిమ్మ కాయలు మార్కెట్‌కు అధికంగా వస్తున్నాయి. డిమాండ్ కూడా లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి.

– నూక క్రాంతి, మార్కెంటింగ్ కొనుగోలుదారు, నకిరేకల్

మ్యారేజ్ బ్యూరో పేరుతో మోసాలు

- తల్లీకుమార్తెను అరెస్ట్ చేసిన పోలీసులు

మిర్యాలగూడ టౌన్: మ్యారేజ్ బ్యూరో పేరుతో మోసాలకు పాల్పడుతున్న తల్లీకుమార్తెను మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు విలేకరులకు వెల్లడించారు. మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వసుపులేటి విజయలక్ష్మి, ఆమె కుమార్తె సుమప్రియ ప్రస్తుతం ఏపీలోని విజయవాడలో నివాసముంటున్నారు. వీరిద్దరితో పాటు జనగామకు చెందిన ఎస్‌కే జానీ, విజయవాడకు చెందిన లక్ష్మీధనమ్మ, రావుల పాటి విజయలక్ష్మి ముఠాగా ఏర్పడి మ్యారేజ్ బ్యూరో ఏర్పాటు చేశారు. వీరు ఏపీలోని అనకాపల్లి, హైదరాబాద్ నుంచి రికార్డు డ్యాన్స్‌లు చేసే యువతులను తీసుకొచ్చి పెళ్లికాని యువకులకు మాయమాటలు చెప్పి పెళ్లిళ్లు చేసేవారు. సదరు యువతులు 20రోజులు కాపురం చేసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయేవారు. ఇలా నలుగురు అమ్మాయిలకు ఏడు పెళ్లిళ్లు చేసి ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల చొప్పున వసూలు చేశారు. అంతేకాకుండా అధిక లాభాలు వస్తాయని పలువురి వద్ద డబ్బులు వసూలు చేసి తిరిగి ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్నారు. సుమప్రియ మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన నెక్కంటి సురేష్‌ను 2023లో రెండో వివాహం చేసుకుంది. తన భర్త స్నేహితులు నలుగురి నుంచి వ్యాపారం పేరుతో సుమారు రూ.85లక్షల వరకు వసూలు చేసింది. వీరి ద్వారా మోసపోయిన మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామానికి చెందిన రత్నకుమారికి ఈ నెల 1వ తేదీన మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టిన తల్లీకుమార్తె విజయలక్ష్మి, సుమప్రియను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వీరు వ్యాపారం, మ్యారేజ్ బ్యూరో పేరుతో మొత్తం రూ.1.53కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మించవద్దని ధర్నా



తిరుమలగిరిలో ధర్నా నిర్వహిస్తున్న ఇళ్ల యజమానులు, చిరు వ్యాపారులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి క్రాస్ రోడ్డు నుంచి వెళుతున్న930- పీ జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మించ వద్దని ఇళ్ల యజమానులు, చిరు వ్యాపారులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే ఏడబ్ల్యూ రామరాజు, డీఈ శ్రీధర్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని సతీష్, బత్తుల శ్రీను, సామ ఆంజనేయులు, భాస్కర్, నాని, కృష్ణ, శ్రీహరి, భాస్కర్, నాగానంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేప చెట్టుకు, రావి చెట్టుకు కల్యాణం



నేరేడుచర్లలోని విజయదుర్గ ఆలయంలో కల్యాణ మహోత్సవం

హుజూర్‌నగర్: నేరేడుచర్లలోని శ్రీవిజయదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా మూడవ రోజు బుధవారం శ్రీనింబ మహాలక్ష్మి(వేప చెట్టు), అశ్వర్థ నారాయణ (రావి చెట్టు)ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మొలుగు శ్రీనివాసాచార్యుల బృందం అంగరంగవైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తలూరి పెద్ద సైదులు ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు కొణతం ఆదిరెడ్డి, రాచకొండ రామ కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీవైఎల్ శిక్షణ తరగతులు

కోదాడ: కోదాడ పట్టణంలో 25,26 తేదీల్లో పీవైఎల్ రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య తెలిపారు. బుధవారం మోతె మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీవైఎల్ రాజకీయ శిక్షణ తరగతులకు ప్రగతిశీల యువజన సంఘం సభ్యులు హాజరు కావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు.ఈ శిక్షణ తరగతుల్లో పీవైఎల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు బండారు ఐలయ్య ప్రసంగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమలలో కోట మధుసూదన్‌రెడ్డి, రవి, నాగరాజు, లింగయ్య పాల్గొన్నారు,

భక్తి.. బహుమతి



భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఓల్డ్‌సిటీ దుర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శరన్నవ రాత్రోత్సవాలలో భాగంగా భక్తులకు గిఫ్ట్ కూపన్ల ఆఫర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. రూ.101 చెల్లించి కూపన్ తీసుకొన్నవారికి అక్టోబర్ 4న నిర్వహించే బంపర్ డ్రాలో మొదటి బహుమతి కింద స్కూటీ, రెండో బహుమతి వాషింగ్ మెషిన్, మూడో బహుమతి టీవీ, నాలుగో బహుమతి కుట్టుమిషన్, ఐదవ బహుమతి ఆక్వా వాటర్ ఫిల్టర్, ఆరవ బహుమతి కింద సైకిల్‌ను ఇవ్వనున్నట్లు నిర్వాహకులు అంకం సాయి తెలిపారు. అదే విధంగా పద్మశాలి సభావేదిక వద్ద దుర్గకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద రూ.100 చెల్లించి కూపన్ తీసుకొంటే అక్టోబర్ 3న నిర్వహించే డ్రాలో 11తులాల అమ్మవారి వెండి విగ్రహాన్ని బహుమతిగా ఇవ్వనున్నట్లు కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ మురళి తెలిపారు.

యాదగిరికొండపైన ఫైర్ మాక్ డ్రిల్





అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ ఇస్తున్న అగ్నిమాపక అధికారులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ సన్నిధిలో బుధవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలయ ఎస్‌పీఎఫ్, హోంగార్డు, సెక్యూరిటి, ఆలయ సిబ్బందికి వివరించారు. ఎలా ప్రాణాలను కాపాడాలనే అంశంపై ఈ మాక్ డ్రిల్ చేశామని అగ్ని మాపక కేంద్రం సిబ్బంది అబ్దుల్ అహ్మద్, మధుసూదన్, ఎస్‌పీఎఫ్ ఆర్‌ఐ శేషగిరిరావు వెల్లడించారు.

నేడు, రేపు సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ పర్యటన

హుజూర్‌నగర్ : రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురు, శుక్రవారాల్లో సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 25వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు సూర్యాపేటలో కాప్స్ ఫిట్నెస్ సెంటర్, పోలీస్ క్యాంటీన్, కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ, జిల్లా స్థాయి అధికారుల నివాస భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం 6 గంటలకు మోతె మండలం అన్నారిగూడెం పాలేరు రిజర్వాయర్ సమీపంలో మోతె ఎత్తిపోతల పథకంపై సమీక్షించనున్నారు. అనంతరం విభళాపురంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన తర్వాత మోతెలో అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారు. రాత్రి 8 గంటలకు కోదాడలో నూతనంగా నిర్మించనున్న ఆర్‌టీసీ బస్టాండ్ పనులకు శంకుస్థాపన చేస్తారు. గుడిబండలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తారు. 9.30 గంటలకు చిలుకూరులో జెర్రిపోతులగూడెం బీటీ డబుల్ రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం 10.15 గంటలకు హుజూర్‌నగర్‌లో మోడల్ కాలనీ వరకు డబుల్ రోడ్డు పనులతో పాటు ఆర్‌టీసీ నూతన బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

26 తేదీన: ఈనెల 26 తేదీన ఉదయం 8.45 గంటలకు గడ్డిపల్లిలో గడ్డిపల్లి నుంచి యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ వరకు డబుల్ లైన్ బీటీ రోడ్డుకు శంకుస్థాపన, 9.15 గంటలకు పానుగోడులో అప్పన్నపేట బీటీ రోడ్డుకు, పాత బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు వరకు బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. 10 గంటలకు నేరేడుచర్లలో పాత నేరేడుచర్ల రోడ్డు వరకు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. 10.15 గంటలకు గరిడేపల్లి మండలం గానుగబండలో పరెడ్డి గూడెం బీటీ రోడ్డుకు, హనుమంతులగూడెం బీటీ రోడ్డుకు, కల్మలచెర్వులో గానుగబండ బీటీ రోడ్డు, పాలకవీడు సబ్ స్టేషన్ వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కల్మలచెర్వులో బొత్తలపాలెం, దిర్శించర్ల బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 12.45 గంటలకు పాలకవీడు మండలం యల్లాపురం లో 33 /11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి, అలింగా పురంలో లింక్ రోడ్డుకు, బెట్టే తండాలో శూన్యపహాడ్ వరకు బీటీ రోడ్డు, ముసి ఒడ్డు సింగారంలో రోళ్లవారి గూడెం బీటీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం 2.30 గంటలకు నేరేడుచర్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, వీధి లైట్లకు మంత్రి ఉత్తమ్ ప్రారంభిస్తారు. ఈ వివరాలను మంత్రి పీఆర్‌ఓ వెంకట రెడ్డి బుధవారం వెల్లడించారు.

పుడమి మురవంగా.. కనువిందుగా

పెద్దవూర: పెద్దవూర మండలంలోని పల్లెలు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి. పత్తి, వరి, ఆముదం, సజ్జ, జొన్న, దోస, వేరుశనగ పంటలు ఏపుగా పెరిగి భూమికి ఆకుపచ్చని రంగేసినట్లు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం దసరా సెలవులతో పట్టణాలు, నగరాల నుంచి పల్లెలకు వచ్చిన ప్రజలు, విద్యార్థులు పంట పొలాలకు వెళ్లి పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు.



వరి చేను



ఏపుగా పెరిగిన పత్తి చేను



జొన్న చేను



సజ్జ చేను



ఆముదం చేను



బత్తాయిలో వేరుశనగ



దోస తీగ, కంది చేను